
# 'మూల'సూత్రం

ఐతా చంద్రయ్య



శివరాత్రి నాడు శ్రీశైలం కొండలా మెదక్ బస్టాండు వచ్చీపోయే జనాలతో కిటకిటలాడ్తోంది.

'సిద్దిపేట కిప్పుడు ఎక్స్‌ప్రెస్ బస్సు లేదు. అదో... ఆర్డనరీ బస్సు తయారుంది'

కిటికీలోంచి ఎటో చూస్తూ గుంపులో గోవిందయ్యలాగున్న నాకు జవాబిచ్చాడు విచారణాధికారి. బస్సు కోసం ఎదురుచూపులంటే మరణశయ్య మీద చావు కోసం చూస్తున్నట్టే అన్పిస్తుంది. ఉసూరుమంటూ జబ్బలు జారేశాను.

మెదక్ టౌన్లో పనులు ముగించుకుని ఆదరాబాదరాగా బస్టాండ్ చేరేసరికి సాయంత్రం నాలుగున్నరైంది. ఎక్స్‌ప్రెస్సే ఎక్కాలంటే ఇంకో రెండు గంటలు కళ్లల్లో వత్తులేసుకుని ఎదురుచూడాలి. ఘోర పాప ఫలితాన్నను భవిస్తూ ముళ్లకంప మీద మూల్గుతున్నట్టనిపించింది. ఆర్డనరీ బస్సులోనైతే అర్ధగంట ఎక్కువసేపు కూచోవాలి. కానీ... చార్జీలో ఐదు రూపాయలు కలిసొస్తుంది గదా. వెంటనే బయల్దేరుతుంది కూడా. వేడి తాకిన ధర్మామీటర్లో పాదరసంలా బుర్ర పొరల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. నిదానమే ప్రధానమన్న సామెత సపోర్టు చేసింది.

ఇంకా ఆలస్యమెందుకూ? పది గజాల దూరంలో ఉన్న ఆర్డనరీ బస్సు వద్దకు ఐదారు అంగల్లో చేరుకుని ఒకే గంతులో ఎక్కేశాను. వెనక సీట్లు ఖాళీ. ముందు భాగంలో కొందరు కొలువుదీరి ఉన్నారు. అంతా కలిసి లూటీకి గురైన పల్లిచేను లాగుంది. ముగ్గురి సీటు మీద ఒక్కడినే కాళ్లు బార్లాచాచి ఒరిగి కూర్చున్నాను. అలసిన ప్రాణానికి హాయిగా... వెన్నుపూసకు వెన్న రాసినట్టుంది.

ఆ హాయి ఐదు నిమిషాలుందో లేదో గొర్రెల మందలా బడి పిల్లలు బస్సును చుట్టుకున్నారు. పుస్తకాల బ్యాగుల్తో ఒకరినొకరు తోసుకుంటూ మా బస్సు ఎక్కేశారు. కళ్లకు వెలుతురు పూవుల్లా, చెవులకు చిట్టెలుకల్లాగున్నారు. ఇద్దరాడ పిల్లలు నవ్వుకుంటూ వచ్చి నా పక్కన కూచున్నారు. మరెందరో పిల్లలు నుంచున్నారు. మోపెడు పుస్తకాలకు తోడు టిఫిన్ బాక్సు, వాటర్ బాటిల్... పిల్లల్ని చూస్తూంటే జాలేసింది. మా సీటు మీద నాల్గో మనిషికి చోటు లేదు. చదువుకునే రోజులు కావివి. చదువు'కొనే' రోజులాయె... నన్ను నేను సముదాయించుకున్నాను.

కండక్టర్ ప్రత్యక్షమయ్యాడు. పిల్లల్ని వరుసల్లో నిలబెట్టే ప్రయత్నం చేశాడు. అది అసాధ్యమని తేలిపోయింది.

'అబ్బబ్బ! నీ యవ్వ! హౌజు ఫుల్లు క్యాషు నిల్లు. పోరలయన్నీ ఫ్రీ పాసులే' స్టూడెంట్ పాసుల్ని పంచ్ చేస్తూ తన సొమ్మంతా ఎవరో దోచుకుపోయినట్టు విసుక్కున్నాడు. అక్కడక్కడా టికెట్లిస్తూ, పాసులన్నీ పంచ్ చేసేసరికి అరగంట హారతి కర్పూరమైంది. అపుడన్పించింది. ఆర్డనరీ బస్సులలో అంత దూర ప్రయాణం అగ్ని పరీక్షేనని. బస్సు సద్దుల బతుకమ్మలా బయలుదేరింది.

పాపం పిల్లలు! సూర్యోదయంతో పోటీ పడుతూ నిద్రలేచి తయారై బస్టాప్ చేరుకోవాలి. రెక్కలు ముడుచుకున్న పక్షిలా బస్సెక్కి రెక్కలు విప్పి నుంచోవాలి. పొద్దంతా స్కూల్లో పాఠాలతో గడపాలి. సాయంత్రం పోటీలు పడుతూ గూటికి చేరుకోవాలి. ఆ వయసులో మేం పట్నంలోనే అద్దె గదిలో ఉంటూ వండుకు తింటూ చదువు సాగించేవారం. ఊరికో బస్సు ఇంటికో కరెంటు దీపం పథకం పుణ్యమాని పరిస్థితి మారిపోయింది.

'ఎక్కడ దిగుతారంకుల్?' నా పక్కన ... ఒళ్లో పుస్తకాలు పెట్టుకుని కూచున్న అమ్మాయి పలకరించింది. చెప్పాను.

'మీరెక్కడ దిగుతారమ్మా?' అడిగాను అందర్నీ చూస్తూ.

'శ్రీనగరం అంకుల్!' నల్లని కళ్లను విచిత్రంగా తిప్పింది. చలాకీ పిల్లనే! పిల్లలన్నా, వారితో గడపాలన్నా నాకెంతో ఆసక్తి. పిల్లల్లో పిల్లాడినై పోయి మళ్లీ బాల్యంలో జీవించాలనే ఆరాటం అప్పుడప్పుడు నిజమవుతుంది. కొందరి పేర్లు, స్కూలు వివరాలడిగి తెలుసుకున్నాను. నుంచున్న వారి బ్యాగులు స్టాండు మీదున్నై.

నా పక్కన చాకులాగున్న అమ్మాయి రవళి... జీన్ పాంటు, బుషర్ట్, ఇన్‌షర్ట్, బాబ్డ్ హెయిర్... డ్రెస్సు పూర్తిగా వొంటి కతుక్కుపోయింది. ఆమె పక్కన కూచున్నమ్మాయి సంతోషి... పరికిణీ, సన్నని వోణీ, చెవులకు దుద్దులు, దోసగింజ బొట్టు తెలుగు వెలుగులు విరజిమ్ముతూ ముద్ద మందారం లాగుంది. వాళ్ల కటుపక్కన తోవలో నుంచున్న అమ్మాయి పంజాబీ డ్రెస్సులో కాశ్మీర్ కీ కలీ లాగా... హుషారుగా ఉంది. ఆ ముగ్గురూ తొమ్మిదో తరగతేనట. హాయిగా మాటామంతీతో గడిపేందుకిదో సువర్ణావకాశం. నుంచున్న అమ్మాయి చున్నీ సవరించుకుంటూ.

'ఏయ్ రవళీ! టీవీలో సీరియల్సన్నీ చూస్తున్నావా?' అడుగుతూంటే కనుబొమ లెగిరి పడినై.

'ఓ... చూస్తున్నా. మిస్సయ్యేందుకు నేనేమన్నా పప్పు ముద్దనా, లేక పాత చింతకాయ పచ్చడినా?' ఛాతీ విరిచి గర్వంగా జవాబిచ్చింది. వికసించబోతున్న వయసు పొంగుల్ని ఇన్‌షర్ట్ బయటపెట్టింది. చెవిరింగులు ఉయ్యాలలూగినై.

అటు బస్సు ఐదు నిమిషాలకోసారి ప్రతి స్టేజిలో ఆగుతూ ముందుకెళ్తూంటే ఇటు ఏవేవో టీవీ ఛానళ్ళ సీరియల్స్ గురించి సీరియస్‌గా చర్చ జరుగుతోంది. ఏ సీరియల్లో ఏ యువతి పెళ్ళి కాకుండా నెల తప్పిందో, ఎందులో రేప్ సీన్లు ఎట్లా చూపించారో, ఏ స్పాట్‌లో ప్రేమికులెలా ఎంజాయ్ చేశారో... దృశ్యాల వివరణతో సహా ముచ్చటించుకుంటున్నారు.

వాళ్ల కబుర్లలో తలదూర్చాలంటే ఆ విషయాల్లో నాక్కూడా కొంత పరిజ్ఞాన ముండాలి. నాకది లేదు కాబట్టి శ్రోతనై పోయాను. సర్కస్ ఫీట్లలాగున్న వాళ్ల హావభావాల్ని నా చూపులు ఏరుకుంటున్నాయి.

నుంచున్న అమ్మాయితో రవళి కనుబొమ లెగరేస్తూ 'నువు మిడ్‌నైట్ మసాలా చూస్తున్నావా?' క్విజ్ మాస్టారులా పోజిచ్చింది.

బస్సు పై కప్పు విరిగి నెత్తిమీద పడ్డట్టు ఉలికి పడ్డం నా వంతైంది. అదేదో టీవీ ఛానల్లో కేవలం పెద్దల కోసం అర్ధరాత్రి ప్రసారం చేస్తున్న ప్రత్యేక కార్యక్రమమని విన్నాను. సంతోషి మొహం సగం ముడుచుకుపోయి ప్రశ్నార్థకమైంది. నుంచున్న అమ్మాయి చూపులు నిరాశగా సంతోషి పరికిణీ అంచుల్ని తాకుతున్నాయి. అలాగే నోరు విప్పింది.

'ఆ సీరియల్ గురించి విన్నాను కాని, మా అమ్మానాన్నలు చూడనివ్వరు. రాత్రి పదింటికే పడుకోబెడ్తారు' పెదాలు చప్పరించింది. ఎదుటి వారు పుల్లారెడ్డి మిఠాయిలు తింటూంటే నిరాశగా తలవంచినట్టుందా అమ్మాయి వాలకం.

మిడ్‌నైట్ మసాలాలో శృంగారం శృతి మించిందని పత్రికల్లో విమర్శలు చదివాను. పొట్టి మూతితో జామపండు కొరికి తినే చిట్టి చిలక నోట్లో గుమ్మడిపండు కుక్కినట్టు... ఎదిగీ ఎదగని కిశోర వయసులో పిల్లలది చూడొచ్చా? దంపతులు కప్పుకుని ఆనందించే విషయాలను ఆ పిల్లలు విప్పి చెప్పుకుంటూంటే గందరగోళంలో పడిపోయాను. ఒళ్ళంతా ముళ్లు గుచ్చుకున్నట్టయింది. కానీ... పాఠశాల విద్యలో సెక్స్ పాఠాలను సిలబస్‌లో చేర్చి బోధించాలనుకుంటున్న ప్రభుత్వ విధానానికది వ్యతిరేకం కాదేమో! అయినా ఊరుకోలేకపోయాను. లోపలి అలజడి నదిమిపట్టి.

'నువ్వా ప్రోగ్రాం రెగ్యులర్‌గా చూస్తున్నావా బుజ్జీ' రవళి నడిగాను. ఏం జవాబిస్తుందోనని.... ఏదో పట్టింపు.

'అవునంకుల్!...' రవళి కనుదోయిలో గర్వం తాలూకు వెలుగు రవ్వలు 'నేను, మా తరుణ్‌గాడు మిస్ కాకుండా చూస్తాం'

సంతోషి ముద్దు మొహమ్మీద ఉత్సాహం చాయలు దోబూచులాడినై. 'వాళ్లమ్మ క్లబ్బుకెళ్తుంది...' చెప్పబోతుంటే రవళి అడ్డుకుంది.

'అయితే ఏంటటా?' నిలదీసింది.

సంతోషి ముఖారవిందము చప్పున ముడుచుకుపోయింది.

అయ్యో పాపం! అన్పించింది.

'మీ తరుణ్‌గాడా? అతడెవరమ్మా?' నా అనుమానం.

'మా అన్నయ్య అంకుల్' రవళి విజయ దరహాసం. 'వాడు ఇంటర్ ఫైనల్. రోజూ మెదక్కొచ్చి పోతుంటాడు... వాడు ఎస్సెస్సీలో ఫస్ట్ క్లాసంకుల్'

'అలాగా! మీ అమ్మానాన్న లేం చేస్తున్నారమ్మా?'

'మేం అమ్మ అనం. మమ్మీ. మా మమ్మీకి మా ఊరి దవాఖానల ఉద్యోగం. మా డాడీ హైద్రాబాద్‌లో పెద్దాఫీసర్' చలాకీగా చెబుతోంది. 'మమ్మీ పొద్దున్నే ఉద్యోగానికెళ్తుంది. అప్పుడప్పుడు నైట్ డ్యూటీ ఉంటుంది. డాడీయేమో ప్రతి శనివారం రాత్రికొచ్చి సోమవారం పొద్దున వెళ్తుంటడు'

'పగలంతా ఇంటికి తాళముంటుంది' సంతోషి సర్దుక్కొచుంది.

'అవును మరి' రవళి అందుకుంది. 'ఇంటికి లాక్ వేస్తామంకుల్. ఒక కీ మమ్మీ దగ్గర, ఇంకోటి నా దగ్గరుంటుంది. రోజూ మా అన్నయ్యకంటే ముందే నేనింటికొస్తా'

'వాళ్లింట్ల సీడీ ప్లేయరుంది సార్. ఇష్టమొచ్చిన సినిమా కాసెట్టు తెచ్చుకుని మంచిగ చూస్తరు' సంతోషి గొంతులో సన్నని బాధ. బహుశః అలాంటి అవకాశం వాళ్లింట్లో లేదని కావచ్చు.

'ఓహో... అట్లానా?'

'అవునంకుల్!' నుంచున్న అమ్మాయి బస్సు కుదుపునకు తూలి పడబోయి నిలదొక్కుకుంది. 'అంతే కాదు. వాళ్లింట్ల పెద్ద కలర్ టీవీ ఉంది. మా ఇండ్లల్ల చిన్న టీవీలే' విచారం వెలిబుచ్చింది. సంతోషి అంతా వింటూ మొగ్గలా ముడుచుకుపోతోంది. ఆ అమ్మాయి అటూ ఇటూ చూస్తూంటే ఒంటిరాయి ముక్కుపుడక తళుకులు దుద్దుల చెమక్కుల్లో కలిసిపోతున్నాయి.

బస్సు మళ్ళీ ఆగింది. కొందరు పిల్లలు దిగారు. ఇద్దరు పెద్దవాళ్ళెక్కారు. బస్సులాగే సంతోషి కూడా ముభావంగా ఉంది. కదుల్తూంటే బయటకు చూస్తోంది. అది నాకు నచ్చలేదు. సంతోషిని మాట్లాడించాలి...'

'ఏమ్మా సంతోషీ! నువు టీవీ చూడవా?' లాలనగా అడిగాను.

'చూస్తారు సార్' హుషారై నావైపు తిరిగింది.

'ఏం ప్రోగ్రామ్స్ చూస్తుంటావ్?'

'బాలసుబ్రహ్మణ్యం పాటల ప్రోగ్రాం. ప్రతి ఆదివారం విష్ణు పురాణం. స్వామి అయ్యప్ప సీరియల్స్.... అప్పుడప్పుడు వార్తలు. ఒక్కోసారి సినిమాలు...'

'ఆ... అదో పప్పు ముద్దంకుల్! వాళ్ళమ్మా నాన్నలు చూడమన్నవి మాత్రమే చూస్తదటా?' ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకినట్టు మెలికలు తిరిగింది రవళి. హేళనగా నవ్వింది కూడా.

'అట్లా ఎందుకు నవ్వుతున్నావమ్మా?'

'ఆ ప్రోగ్రాముల్లో ఏముంటుంది అంకుల్. పాత చింతకాయ పచ్చడి' సర్దుకుంది. 'ఆ డైలాగులు, కిరీటాలు... పౌరాణికాలన్నీ పరమ బోర్. మా ఇంట్లో ఎవ్వరమూ చూడము'

'నీ మొహం...' సంతోషి మొహం చిట్లించింది. 'శంకరాభరణం, సాగర సంగమం, మావిడాకులు, ఆహ్వానం లాంటి సినిమాలు చూసినవా?'

'వ్వవ్వవ్వవ్వ...' వెక్కిరిస్తూ లడాయికి దిగింది.

'పోనీలేమ్మా! వాటి గురించి ఇప్పుడెందుకు తగాదా?'

ఇద్దరినీ సముదాయించి శాంతింపజేశాను. నుంచున్న అమ్మాయిని.

'నువ్వేం ప్రోగ్రాములు చూస్తుంటావమ్మా?' అనునయంగా అడిగాను.

'కొన్ని సీరియల్స్ చూస్తుంటా. మా అమ్మా నాన్నలు అన్నీ చూడనివ్వరు. చాలా రాత్రిదాకా మేల్కొని ఉండనివ్వరు' నిర్వేదంగా చెప్పేసింది.

సంతోషి మొహం మళ్లీ ముడుచుకు పోయింది. ఆ అమ్మాయి వాలకం మారాలి... హుషారు కావాలి. ఆమెను సూటిగా చూస్తూ చిరునవ్వుతో...

'ఆ నిల్చున్న అమ్మాయిదే ఊరమ్మా' కావాలనే అడిగాను. సంతోషి మొహం సంపెంగ పూవులా విచ్చుకుంది.

'ఆమెది కూడా మా ఊరే సార్!' కళ్లల్లో కాంతులు. 'మా ముగ్గురిదీ ఒకటే క్లాసు'

ఇంకాస్సేపు వాళ్లతో కాలక్షేపం చెయ్యాలనుంది కాని కాలగమనం కడలి కెరటం మనిషి కోసం ఆగవంటారు కదా. బస్సు వేగం తగ్గించుకుని శ్రీనగరం స్టేజిలో ఆగింది. మిగతా వారితోపాటు ఆ ముగ్గురమ్మాయిలు కూడా దిగిపోయారు.

బస్సు చాలావరకు ఖాళీ ఐపోయింది. నా లోపలి అలజడి కూడా ఖాళీ అయింది. కిటికీలోంచి ప్రకృతి అందాలను, సృష్టికర్త చిద్విలాసాన్ని చూస్తుండిపోయాను. బస్సు ముందుకు పరిగెడుతూంటే చెట్లు తలలాడిస్తూ... కొమ్మల చేతులూపుతూ వీడ్కోలు చెబుతున్నాయి.

ఓ సంవత్సర కాలం సజావుగా గడిచిపోయింది. భూత కాలం దృశ్యాలను మనసు కెమెరాతో చిత్రీకరించి మెదడు కేసెట్‌లో భద్రపరచుకుని, కావాలనుకున్నప్పుడు జ్ఞాపకం తెర మీద చూపించే శక్తి మానవ 'యంత్రాని'కుంది కదా.



'వాళ్లింట్ల సీడీ ప్లేయరుంది సార్. ఇష్టమొచ్చిన సినిమా కాసెట్టు తెచ్చుకుని మంచిగ చూస్తరు' సంతోషి గొంతులో సన్నని బాధ. బహుశః అలాంటి అవకాశం వాళ్లింట్లో లేదని కావచ్చు.

ఆ రోజు ఆదివారం. పొద్దు పొడుపుతో నిద్రలేచి ఆవులిస్తూ మంచం దిగుతున్నాను. సెల్‌ఫోన్ రింగ్‌తో పిలిచింది.

'అన్నయ్యా! ఇవాళ్ళ పదింటికి శ్రీలతకు పెళ్ళిచూపులు. ఆ ఫార్మాలిటీస్ మాకు సరిగా తెలీవు. నువ్వూ, వదిన సాధ్యమైనంత త్వరగా రావాలి' ఫోన్‌లో పురమాయించాడు మా తమ్ముడు. శ్రీలత అతని ముద్దుల కూతురు.

'సరే వస్తాం! అబ్బాయిదే ఊరు? ఏం చేస్తుంటాడు?'

'సొంతూరు మెదకు దగ్గరట. అబ్బాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఏదో పేరున్న కంపెనీలోనట...'

'ఇంకేం! ఈ రోజుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగి అంటే స్వర్గలోక నివాసి అంటారు కదా! మా శ్రీలత కూడా ఎంసిఏ పాసైంది. చక్కని అందం... చక్కని మాటకారి.

త్వరగా తయారై తొమ్మిదికల్లా సతీసమేతంగా బండి మీద తమ్ముడింటికి చేరుకున్నాం. చకచకా ఏర్పాట్లు పూర్తైపోయిన్నై. ఎదురుచూపుల్లో ఉన్నాం.

సుమారు పదకొండు కావొస్తోంది. ఝూమ్మంటూ మారుతి కారు పరుగెత్తికొచ్చి ఇంటి ముందాగింది. పెళ్లివారు దిగుతున్నారు. అబ్బాయినీ, వాళ్లమ్మానాన్నల్ని మా తమ్ముడు పరిచయం చేశాడు. వాళ్ల వెంట ఉన్న పెద్ద మనిషిని వాళ్లే పరిచయం చేశారు.

అందమంతా తన సొంతమే అన్నట్టుగా అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. తల్లిదండ్రులు నడివయస్కులు. అంతా కూచున్నాం. దోర వయసులో ఉన్న వధూవరుల ఓరచూపులు కలుసుకున్నాయి. అబ్బాయి పెదాల మీద అమ్మాయి బుగ్గల మీద సిగ్గుల సింగారం అందరినీ ఆకట్టుకున్నాయి. అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చినట్టుగా తల్లిదండ్రుల ద్వారా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఆలస్యం అమృతం విషమవుతుందేమో ననుకున్నారంతా. కమ్మని సర్వపిండి టిఫిన్, వేడిచాయ పూర్తయ్యేలోగా సెల్‌ఫోన్‌కు పనిచెప్పి పురోహితుడిని పిలిపించాం.

వధూవరుల జన్మనామాలు, నక్షత్రాలు పురోహితుడి వేళ్ల మీదాడుతూ పంచాంగం రెక్కలు విప్పించాయి. ఇటు చాయ సేవిస్తూ అటు తెల్ల కాయితమ్మీద కుంకలి వేసి ఏవేవో గుణించాడు. పురోహితుడు తృప్తిగా ఊపిరి పీల్చుకుంటూంటే అతని పెదాల మీద చిరునవ్వు విరబూసింది.

'జాతకాలు మా బాగా కుదిరినై. రాశికూటాలు బాగున్నై' ప్రకటించి సోఫా 'కొరిగాడు.

మేమంతా ఒకరినొకరం చూసుకుని ఊపిరి పీల్చుకున్నాం. మాటామంతీ, ఆ తర్వాత ముహూర్తాల డేటు... అంతా అయ్యేసరికి ఒంటి గంట దాటింది. అప్పటికే వంటల ఘుమఘుమలు మా ముక్కుల దాకా వచ్చి ఆకలిని గుర్తు చేస్తున్నయి. భోజనాలకు రెడీయై వరుసగా డైనింగ్ టేబుల్ చుట్టూ కూచున్నాం. వాళ్ల తరఫు పెద్ద మనిషి మంచి అనుభవజ్ఞుడని, లోకం పోకడ తెలిసిన వాడని అతని మాట తీరు, వ్యవహార శైలితో తెలిసిపోయింది. నేను అతని పక్కన కూచున్నాను. భోజనాల ప్రారంభంతోనే మాటల్లోకి దింపానతణ్ణి.

'మెదకు దగ్గరంటే... ఏ ఊరన్నా?' పప్పన్నంలో నెయ్యి కలుపుకుంటూ అడిగాను.

'శ్రీనగరం...' అప్పడం కొరుకుతూ జవాబిచ్చాడు.

'శ్రీనగరమా? మీది కూడా అదే ఊరా?'

'అవునన్నా... ఏమన్నా అనుమానమా?'

'కాదు గానీ...'

'ఆ కానీ పక్కనబెట్టి అసలు విషయం అడుగన్నా!' కండువా సవరించుకున్నాడు - ఎడమచేత్తో.

'ఆ... అదే... అదేమంత ముఖ్యమైంది కాదనుకో...'తో ప్రారంభించి సంవత్సరం క్రితం మెదకు బస్సులో నాతో కలిసి ప్రయాణించిన బుట్టబొమ్మ ల్లాంటి శ్రీనగరం అమ్మాయిల గురించి ప్రస్తావించాను. ఆ అమ్మాయిల హావభావాలు మనసు తెర మీద ప్రత్యక్షమైనయి.

'మీ ఊళ్లో రవళి, సంతోషి అనే అమ్మాయిలున్నారు గదా'

'అవును...'

'వాళ్లు మెదకులో చదువుకుంటున్నారు కదా. బహుశః ఇప్పుడు పదో తరగతి కావచ్చు'

అతని భృకుటి ఆశ్చర్యంగా ముడిపడింది. నోట్లో కెళ్లాల్సిన ముద్ద చేతిలోనే ఉండిపోయింది.

'వాళ్లు మాకు ఇరుగు పొరుగు వాళ్లిద్దరి ఇండ్ల మధ్య మా ఇల్లుంది...'

'ఆహా... అట్లానా?'

'అవును గానీ...' చేతిలోని ముద్ద మూతిలో కెళ్ళింది. 'పాపం... ఆ రవళి అమ్మాయే...'

'ఆ... ఆ రవళి కేమైందన్నా?' నా కనుబొమలు పీట ముడేసుకున్నయి.

'వాళ్లిద్దరి గురించి నాకు బాగా తెలుసు గానీ నీకెలా తెలుసన్నా?' అతని మొహంలో రంగులు మారాయి.

మూడు ముక్కల్లో చెప్పేశాను. అతను ఊపిరి పీల్చుకున్నాడు.

'సంతోషి పదో తరగతి చదువుతుంది. కాని... రవళే... పిచ్చిపిల్లి..గా పదిహేనేండ్ల పోరికి కడుపైందన్నా! ఆ సంగతి ఆ పిల్లకే తెల్వదు. వాంతులు చేసుకుంటూంటే తల్లి గట్టిగా అడిగిందట.... ఇప్పుడా కుటుంబం మా ఊళ్లో లేదు. రవళికి అబార్షన్ చేయించింతర్వాత వెళ్లిపోయింద్రు'

పెరుగన్నంలో గులకరాయి పంటి కింద కొచ్చినట్లైంది.

'అయ్యో పాపం! అదెట్లా జరిగిందీ?' ఆ అమాయకురాలిని మోసం చేసిన పాపాత్ముడెవరూ?' నా పెరుగన్నం ముద్ద నోట్లో కెళ్లనంది. చేతిలోనే ఉండిపోయింది.

'హు! కలికాలమన్నా! అంతా కలి మాయ. ఆ పోరికి కడుపైంది వాళ్ల అన్నతోనే. వాళ్లిద్దరూ కలిసి అర్ధరాత్రి దాకా టీవీ ప్రోగ్రాంలు, వీడియో సీడీలు ... అంటే బూతు బొమ్మలు చూసేవారట. తెలిసీ తెలియని వయసు... పాపం!'

'అరెరే... పాపం'

'ఆ... వాళ్లు అమాయకులే కాని వాళ్లమ్మా నాన్నల చెంపల్ని చెప్పుల్తో వాయించాలి...' చెప్పుకుపోతున్నాడు.

నాకైతే లోకం తలకిందులైనట్టనిపిస్తోంది. ★